# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

శుక్రవారం, మే 16 , 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## రూ.30 వేలు ఇస్తేనే మృతదేహం అప్పగిస్తాం!

**భద్రాచలంలో ఓ ఆసుపత్రి కాసుల కక్కుర్తి**

**రూ.7 వేలు చెల్లించి బాలుడి పార్థివదేహం తెచ్చుకున్న తల్లిదండ్రులు**

**కుక్కునూరు:** అతిసారంతో మరణించిన బాలుడి మృతదేహాన్ని అప్పగించేందుకు ప్రైవేటు ఆసుపత్రి అదనంగా రూ.30 వేలు డిమాండ్ చేసింది. అంత మొత్తం ఇవ్వలేని ఆ గిరిజన కుటుంబం మధ్యవర్తులతో రాజీ కుదుర్చుకుని రూ.7 వేలు చెల్లించి బిడ్డ పార్థివదేహాన్ని ఇంటికి తీసుకొచ్చింది. ఈ సంఘటన భద్రాచలంలో చోటుచేసుకుంది. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కురుమలతోగు గ్రామంలో ప్రబలిన అతిసారం మరొకరిని బలితీసుకుంది. తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మడకం దేవ(8) గురువారం ఉదయం మృతి చెందాడు. అక్కడ చికిత్స పొందుతూ దేవ తుది శ్వాస విడిచాడు. బాలుడి మృతదేహాన్ని అప్పగించేందుకు ఆసుపత్రి వర్గాలు అదనంగా రూ.30 వేలు డిమాండ్ చేశాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబం కాళ్లావేళ్లా పడి మధ్యవర్తుల ద్వారా చివరకు రూ.7 వేలు చెల్లించి మృతదేహాన్ని తీసుకొచ్చిందని వాపోయారు.

# భూముల ధరలు సవరించాలి

**మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు పొంతన లేదు**

**రాష్ట్ర ఆదాయం పెంచేందుకు సమన్వయంతో పని చేయండి**

**పన్ను ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించొద్దు**

**సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**



**హైదరాబాద్:** హైదరాబాద్ సహా రాష్ట్రంలో అన్ని చోట్ల భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, కానీ అదే స్థాయిలో రెవెన్యూ రాబడుల్లో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం పెరగలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. చాలా చోట్ల భూముల మార్కెట్ విలువకు, వాస్తవ క్రయ, విక్రయ రేట్లకు పొంతన లేకపోవటం ప్రధాన కారణమని ఆయన అభిప్రాయ పడ్డారు. గురువారం సచివాలయంలో ఆయన రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ''గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయవిక్రయ ధరలకు మధ్య భారీ తేడా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికోసారి మార్కెట్ విలువను సవరించాలి. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టండి. ఎక్కడెక్కడ, ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి... వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు.. వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారించండి. రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగం వారు నిబంధనలను పక్కాగా పాటించాలి. రాష్ట్ర రాబడి పెంపుతో పాటు స్థిరాస్తి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా.. భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే స్టాంప్ డ్యూటీ ఎంత మేరకు ఉంది? దాన్ని తగ్గించాలా? పెంచాలా? అనేది కూడా అధ్యయనం చేయాలి'' అని ముఖ్యమంత్రి ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇప్పటికీ చాలాచోట్ల అద్దె భవనాల్లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్లకు వచ్చే వాళ్లు చెట్ల కింద నిలబడే ఉంటున్నారనే అంశం చర్చకు వచ్చింది. ప్రజా ప్రయోజనాల కోసం సేకరించిన స్థలాల్లో కొన్నిచోట్ల అధునాతనంగా

# రూ.35 వేల కోట్ల సేకరణ ఎలా?

- సీఎం ఆదేశాలతో..
- రైతు రుణమాఫీపై ఆర్థికశాఖ కసరత్తు
- ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకోవడంపై కీలకంగా చర్చ
- భూముల అమ్మకం.. ఇతర మార్గాలపైనా దృష్టి

*హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల రుణమాఫీకి నిధుల సేకరణకు ప్రభుత్వం పలు మార్గాలను అన్వేషిస్తోంది. రుణమాఫీకి రూ.33 వేల కోట్ల నుంచి రూ.35 వేల కోట్ల వరకు అవసరమని ప్రభుత్వం అంచనా వేసినట్లు తెలిసింది. ఈ హామీని కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందేనని, నిధుల సేకరణకు ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో.. ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికలో రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఆగస్టు 15లోగా ఈ హామీని నెరవేర్చి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో ప్రస్తావించారు. విపక్షాలు సైతం ఈ అంశాన్ని ప్రముఖంగా లేవనెత్తాయి.*

2 లో



# హడలెత్తించిన హఠాత్తు వాన

- అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి పటాన్‌చెరు వరకు.. పాతబస్తీ నుంచి మాదాపూర్ దాకా.. హైదరాబాద్ వ్యాప్తంగా వర్షం
- ఖైరతాబాద్‌లో 9.0, షేక్‌పేటలో 8.7 సెం.మీ. వర్షపాతం నమోదు
- రాజధానిలో ఉప్పొంగిన నాలాలు, కొట్టుకుపోయిన వాహనాలు
- రాష్ట్రవ్యాప్తంగానూ కుంభవృష్టి
- నల్గొండ జిల్లా కనగల్‌లో అత్యధికంగా 10.2 సెం.మీ. వర్షపాతం
- పిడుగుపాటుకు ముగ్గురి మృతి

**హైదరాబాద్:** అకాల వర్షాలు మరోసారి రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా విరుచుకుపడిన వాన రైతులు, సామాన్యులను ఆగం చేసింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కొన్ని గంటలసేపు జనజీవనం స్తంభించింది. రాజధాని శివారు ప్రాంతాలైన అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి ఇటు పటాన్‌చెరు వరకు, పాతబస్తీ నుంచి మాదాపూర్ వరకు, మేడ్చల్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు కురిసిన వర్షానికి నాలాలు పొంగి ప్రవహించాయి. రోడ్లన్నీ జలమయమై.. వాహనాల రాకపోకలు గంటల తరబడి నిలిచిపోయాయి. మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు నమోదయ్యాయి. రైతులకు తీరని నష్టం వాటిల్లింది. పిడుగుపాటుకు సిరిసిల్ల జిల్లాలో ఇద్దరు రైతులు, రంగారెడ్డి జిల్లాలో ఓ యువకుడు మృతిచెందారు. నల్గొండ జిల్లా కనగల్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 10.2 సెంటీమీటర్లు, హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో 9 సెం.మీ, షేక్‌పేటలో 8.7 సెం.మీ. వర్షం కురిసింది. ఖైరతాబాద్, కోఠి, అఫ్జల్‌గంజ్, నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్ రోడ్, జూబ్లీహిల్స్, బాలానగర్, అల్వాల్, శేరిలింగంపల్లి, గోల్కొండ, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో వరద - మిగతా 2వ పేజీలో

# పంటల బీమాపై పకడ్బందీ కార్యాచరణ

**వానాకాలం సీజన్ నుంచే అమలు**

**సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు**

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి**



**హైదరాబాద్:** వచ్చే వానాకాలం నుంచి అమలయ్యే పంటల బీమా పథకానికి పకడ్బందీ కార్యాచరణను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. పంటలు నష్టపోయిన రైతులను తప్పనిసరిగా ఆదుకునేలా పథకం ఉండాలన్నారు. ఈ యాసంగి సీజన్‌లో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు మొదటి విడత పంట నష్టపరిహారం రూ.15 కోట్లు పంపిణీ పూర్తయినందున, ఏప్రిల్‌తో పాటు మే నెలలో జరిగిన పంట నష్టాలకు పరిహారం అందించేందుకు నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్రంలో పదవీ కాలం ముగిసిన సహకార సంఘాల్లో సభ్యులను గుర్తించి ఎన్నికల నిర్వహణకు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. గురువారం పంటల బీమా పథకం అమలు, ఇతర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. పంటల బీమా అమలుకు టెండర్ల నిర్వహణ, కంపెనీల అర్హతలు తదితర అంశాలపై చర్చించారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఆదర్శ రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పథకం అమలుపై వారి అభిప్రాయాలను పరిగణనలోకి - 2వ పేజీలో



# విద్యుత్ సరఫరాపై అసత్య ప్రచారం తగదు

**గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్, రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్**

**ఖైరతాబాద్:** రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాపై ప్రతిపక్ష పార్టీకి చెందిన సోషల్ మీడియా అసత్య ప్రచారాలు చేస్తూ విద్యుత్ అధికారులు, సిబ్బందిని మానసిక క్షోభకు గురిచేస్తోందని గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్, రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు - మిగతా 2వ పేజీలో



పీర్జాదిగూడ పెద్ద చెరువు వద్ద కూల్చివేసిన అక్రమ నిర్మాణం

# వాయిస్ టుడే కథనానికి స్పందించిన మేడిపల్లి తహసీల్దార్ హసీనా..!

**హర్షం వ్యక్తం చేసిన మేడిపల్లి మండల ప్రజలు..!**

**బఫర్ జోన్‌లో నిర్మాణలు చేపడితే కూల్చి వేస్తాం..!**

**పలు అక్రమ నిర్మాణాలు కూల్చివేత..!**

**వాయిస్ టుడే న్యూస్, మే 15 మేడిపల్లి:** బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణలకు పాల్పడితే ఉపేక్షేంచేది లేదని మేడిపల్లి తహసీల్దార్ హసీనా అన్నారు. మంగళవారం వాయిస్ టుడే న్యూస్ లో పీర్జాదిగూడ పెద్ద చెరువు కబ్జాల కలకలం... అనే కథనానికి స్పందించిన మేడిపల్లి తహసీల్దార్ హసీనా, బుధవారం రోజు ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న పలు నిర్మాణాలను తన సిబ్బందితో కూల్చివేసారు. 26 వ డివిజన్ శంకర్ నగర్ లో పెద్ద చెరువు వద్ద గతంలో ఎఫ్టిఎల్ బఫర్ జోన్ భూమిలో లో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే పలువురు అధికారులకు పిర్యాదు చేయడంతో ఇరిగేషన్ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు, భూ కబ్జాలకు పాల్పడుతున్నవారిపై గతంలో కేసుకుడా నమోదు చేశారు, ఎన్నికల సమయం ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు మరలా నిర్మాణాల జోరు పెంచి కట్టడాలు కొనసాగించారు, ఇట్టి నిర్మాణాలు సంబంధిత అధికారులు గుర్తించి అట్టి కట్టాడాలను బుధవారం నెలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే ఎంతటివరైన ఉపేక్షించేది లేదని మేడిపల్లి తహసీల్దార్ హసీనా కార్పొరేషన్ ప్రజలను హెచ్చరించారు.

స్పందన



వాయిస్ టుడే

15 May 2024 - Page 3

పీర్జాదిగూడ పెద్దచెరువు కబ్జాల కలకలం..!



# రూ.లక్ష... 50 వేలు... 30 వేలు!

**లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారులు**

**వారిలో ఒకరు వ్యవసాయ, ఇద్దరు విద్యుత్తు శాఖ ఉద్యోగులు**

**అశ్వారావుపేట, చింతపల్లి, నర్సాపూర్:** రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో గురువారం ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. వారిలో ఒకరు వ్యవసాయ, ఇద్దరు విద్యుత్తు ఉద్యోగులు ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన ప్రకారం... అశ్వారావుపేటకు చెందిన రైతు కొనకళ్ల జనార్దన్ తనకు మద్దికొండలో ఉన్న పొలానికి విద్యుత్తు కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం మీసేవా కేంద్రం ద్వారా రూ.లక్ష చలానా తీసి విద్యుత్తు శాఖకు చెల్లించారు. రెండు నెలలవుతున్నా అధికారులు స్పందించలేదు. మరో రూ.లక్ష లంచంగా ఇవ్వాలని ఎన్పీడీసీఎల్ ఏఈ ధరావత్ శరత్ డిమాండ్ చేశారు. దాంతో రైతు కుమారుడు ఆదిత్య ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈమేరకు గురువారం సాయంత్రం స్థానిక పేపరుమిల్లు సమీపంలో ఆదిత్య నుంచి ఏఈ శరత్ లంచం తీసుకుంటుండగా అప్పటికే కాపుకాసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నల్గొండ జిల్లా ఏసీబీ డీఎస్పీ జగదీశ్ తెలిపిన ప్రకారం...

- మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగాత్రం - మనసేత్రం

హైదరాబాద్
శుక్రవారం, మే 16, 2024

# పంటల బీమాపై పకడ్బందీ కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులను సబ్సిడీపై వెంటనే సరఫరా చేయాలని చెప్పారు. వానాకాలం సన్నద్ధతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు వచ్చే నెలాఖరులోగా అందజేయాలన్నారు. వరి కొయ్యలు కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆదేశాలు పాటించని వారికి జరిమానాలు విధించాలన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఈ నెలాఖరులోగా మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఉద్యానశాఖ పండ్ల తోటలను పెంచాలన్నారు. ఆయిల్‌పాం కంపెనీల పనితీరు ఆధారంగా చర్యలు తీసుకోవాలని, మల్బరీ సాగుకు అనుకూలమైన ప్రాంతాలను ఎంపిక చేసి పట్టుపరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల్లో మ్యాచింగ్ గ్రాంట్ బకాయి నిధుల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

# రూ.లక్ష... 50 వేలు... 30 వేలు!

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం వనస్థలిపురానికి చెందిన రైతు రవి సూర్యనారాయణకు నల్గొండ జిల్లా చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లిలో వ్యవసాయ భూమి ఉంది. పొలానికి, ఇంటికి విద్యుత్తు కనెక్షన్ తీసుకోవడానికి 2022లో డీడీలు తీసి, చింతపల్లిలోని సబ్‌స్టేషన్‌లో అందించారు. తర్వాత మల్లారెడ్డిపల్లిలో ఆర్టిజన్ గ్రేడ్-2 ఉద్యోగిగా పనిచేస్తున్న నడింపల్లి వేణుకుమార్‌ను సంప్రదించారు. కనెక్షన్ ఇచ్చేందుకు అతను రూ.50 వేల లంచం డిమాండ్ చేశారు. మొదట రూ.20 వేలు, పని ముగిశాక రూ.30 వేలు ఇవ్వాలని సూచించారు. అనంతరం రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఒప్పందం మేరకు గురువారం చింతపల్లిలోని సాయిబాబా దేవాలయం వద్దకు వస్తే డబ్బులిస్తానని చెప్పి వేణుకుమార్‌ని రైతు రప్పించారు. రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఉద్యోగిని పట్టుకున్నారు.

**మెదక్ అనిశా డీఎస్పీ సుదర్శన్ తెలిపిన ప్రకారం...** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూర క్యాంపు గ్రామానికి చెందిన వంగ నరేశ్... మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఎరువుల దుకాణం ఏర్పాటు చేసేందుకు ట్రేడ్ లైసెన్సు ఇవ్వాలని ఈ ఏడాది మార్చిలో వ్యవసాయాధికారి అనిల్‌కుమార్‌కు దరఖాస్తు చేశారు. అర్జీని ఉన్నతాధికారులకు నివేదించేందుకు ఆయన రూ.30 వేల లంచం అడిగారు. నరేశ్ అప్పట్లోనే ఏసీబీని సంప్రదించగా అనిల్‌కుమార్ కదలికలపై నిఘా పెట్టారు. గురు వారం నర్సాపూర్‌లోని రైతు వేదికలో ఆయన లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.

**ఎంత చిన్న మొత్తమైనా ఫిర్యాదు చేయండి: ఏసీబీ**

ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఇచ్చే లంచం ఎక్కువా... తక్కువా అని ఆలోచించొద్దని, ఎవరు లంచం అడిగినా ఫోను చేయాలని కోరారు.

# విద్యుత్ సరఫరాపై అసత్య ప్రచారం తగదు

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా బాగున్నా అంతరాయాలు కలుగుతున్నట్లు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.శంకర్, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, కోశాధికారి కె.శంకర్, విశ్రాంత అధికారి ఆళ్ల రామకృష్ణ తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత భారాస ప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేయలేదని, విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు నాటి ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం అప్పటి ఎంపీ, నేటి సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా ధర్నాలు చేశారని మండిపడ్డారు. అప్పట్లో నామమాత్రంగా ఉన్న డిస్కంల బకాయిలు, తెలంగాణ విద్యుత్ సంస్థల అప్పులు అమాంతంగా పెరగడానికి గత ప్రభుత్వ లోపాలే కారణమని ఆరోపించారు. గడిచిన తొమ్మిదేళ్లలో అస్తవ్యస్తమైన విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం, యాజమాన్యాలను ఇబ్బంది పెట్టేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని అన్నారు.

# బాకారం శంకరమ్మను పరామర్శించిన పరమేశ్వర్ రెడ్డి దంపతులు



**ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):** ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్ భార్య బాకారం శంకరమ్మ అనారోగ్యం పాలయ్యారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి బుధవారం నీమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాకారం శంకరమ్మను పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి సూచించారు. బాకారం శంకరమ్మకు, ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



**ప్రజా దర్బార్ లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించుకుంటున్న ఉప్పల్ నియోజకవర్గ ప్రజల దృశ్యం. - ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి)**

# భూముల ధరలు సవరించాలి

(మొదటి పేజీ తరువాయి)

మోడల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించాలని, అందుకు సన్నాహాలు చేయాలని సీఎం స్పష్టం చేశారు.

**లక్ష్యాన్ని నిర్దేశించుకొని రాబడి సాధించాలి**

''రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయండి. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. పన్నుల ఎగవేత లేకుండా కఠిన చర్యలు చేపట్టాలి. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరిగేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. అందుకు తగిన సంస్కరణలు అవసరం. శాఖాపరమైన లొసుగులు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించండి. గత ఏడాది వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదు. ఇకపై ప్రతి నెలా ఆదాయ పెంపును సమీక్షించుకోవాలి. బడ్జెట్‌లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే.. ఏ నెలకు ఆ నెల తగిన మేరకు రాబడి సాధించాలి. ప్రధానంగా రాష్ట్రానికి రాబడి తెచ్చిపెట్టే జీఎస్టీ ఎగవేత ఉండకూడదు. జీఎస్టీ ఆదాయం పెంచేందుకు పక్కాగా క్షేత్ర స్థాయి తనిఖీలు, పరిశీలనలు చేయాలి. ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించొద్దు. నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాల్సిందే.

వాణిజ్య శాఖలో ఇంతకాలం జరిగిన పొరపాట్లు పునరావృతం కావొద్దు. జీఎస్టీ రిటర్న్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి, అక్రమాలకు తావీయకండి' అని సీఎం రేవంత్ ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల సీజన్‌లో మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినా.. లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి కారణాలపై ఆయన ఆరా తీశారు.

అక్రమంగా మద్యం రవాణా, పన్ను ఎగవేత లేకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సామాన్యులకు, చిన్న చిన్న నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఇసుక ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను ఎక్కడికక్కడ అరికట్టాలని సీఎం చెప్పారు.

# రూ.35 వేల కోట్ల సేకరణ ఎలా?

(మొదటి పేజీ తరువాయి)



ఈ క్రమంలో ఎన్నికలు ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ప్రజంటేషన్ ఇచ్చినట్లు తెలిసింది. రాష్ట్ర రెవెన్యూ, ఖర్చు, రుణాలకు ప్రతి నెలా చెల్లించాల్సిన అసలు, వడ్డీ.. ఇలా అన్ని అంశాలను వివరించడం తోపాటు రుణమాఫీకి ఎంత మొత్తం అవసరమో కూడా స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. గతంలో రుణాల కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా రుణం తీసుకొని.. తర్వాత కిస్తీల రూపంలో ప్రతి నెలా చెల్లిస్తున్న విషయం తెలిసిందే. రుణమాఫీకి కూడా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి.. స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ద్వారా అమలు చేసే విధానంపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. బ్యాంకులు రుణాన్ని మాఫీ చేస్తే.. ఆ మొత్తాన్ని ప్రతి నెలా కొంత మొత్తంలో ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించే విధానాన్ని అమలు చేయాలనేది ప్రతిపాదన. పెరిగిన ఆదాయాన్ని, అదనంగా సేకరించే నిధులను దీనికి ఖర్చు చేస్తే సరిపోతుందనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. అయితే ఇలాంటి ప్రతిపాదనకు రిజర్వ్ బ్యాంకు అంగీకరించకపోవచ్చనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనపై బ్యాంకులతో చర్చించాలని, వీలు కాకుంటే మరో ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలని, అమలు మాత్రం చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు తెలిసింది. అదనంగా ఆదాయం సమీకరణకు భూములు విక్రయించడం, రెవెన్యూ మొబిలైజేషన్ విభాగాల్లో ఉన్న లోపాలను సవరించి మరింత ఆదాయం వచ్చేలా చూడటం తదితర మార్గాల గురించి కూడా చర్చించినట్లు తెలిసింది. భూముల అమ్మకం ద్వారా వీలైనంత ఎక్కువ సేకరించి, ఆ మొత్తాన్ని రుణమాఫీకి కేటాయించాలనే అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది.







శ్రీనివాస్ రుద్రారపు చంద్రయ్య ప్రవీణ్

# హడలెత్తించిన హఠాత్తు వాన

(మొదటి పేజీ తరువాయి)

ఏరులై పారింది. యూసుఫ్‌గూడ, బంజారాహిల్స్, మలక్‌పేట మెట్రోస్టేషన్ సమీపంలో రోడ్లపై నిలిపిన ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. కూకట్‌పల్లి, బాలానగర్, మూసాపేట, ఎర్రగడ్డ, రాజేంద్రనగర్, అత్తాపూర్ సహ కూకట్‌పల్లి-ఎల్బీనగర్, సికింద్రాబాద్-మలక్‌పేట, చార్మినార్-గచ్చిబౌలి మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించింది. మలక్‌పేట ఆర్‌యూబీ కింద భారీగా వరద చేరడంతో కోఠి నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకూ రెండు వైపులా రాకపోకలు నిలిచిపోయాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 14 మండలాల్లో 6.7 నుంచి 9 సెంటీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది.

**ఒక్కసారిగా కుండపోత**

సిద్దిపేట జిల్లా తొగుట, కొండపాక, దుబ్బాక, మిర్‌దొడ్డి, గజ్వేల్ ప్రాంతాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట కుప్పలపై టార్పాలిన్లు కప్పినప్పటికీ కింది నుంచి వరద పారడంతో తడిసిపోయాయి. కొద్ది రోజులుగా పంటలో తేమ తగ్గడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరబెడితే వర్షాల ముప్పు, కుప్పగా ఉంచితే తేమ శాతంతో తిప్పలుగా ఉందని చెబుతున్నారు. ఎండాకాలంలో ఈ వర్షాలేమిటో నంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ, సూర్యాపేట, భువనగిరి జిల్లాల్లోని పలు మండలాల్లోనూ వర్షాలు కురిశాయి. చివ్వెంల, నిడమనూరు, త్రిపురారం, నేరేడుచర్లలో భారీ వర్షం పడింది. నాగర్‌కర్నూల్ వెల్దండలో 10.1, హైదరాబాద్ ఖైరతాబాద్‌లో 9.0, షేక్‌పేటలో 8.7, వరంగల్ గీసుకొండలో 7.9, సూర్యాపేట ఆత్మకూరు(ఎస్)లో 6.8 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**20వ తేదీ వరకు వర్షాలు**

శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు ఉంటాయని పేర్కొంది. హైదరాబాద్ నగరంలోనూ పలు ప్రాంతాల్లో ఓ మోస్తరుగా కురిసే అవకాశాలున్నాయని తెలిపింది.

**పిడుగుపాటుతో ముగ్గురి మృతి**

వేములవాడ, తంగళ్లపల్లి, కడ్తాల్ (ఆమనగల్లు), న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు ఇద్దరు రైతులు మృతి చెందారు. వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని శాత్రాజుపల్లి శివారులోని వ్యవసాయ క్షేత్రం వద్ద కంబళ్ల శ్రీనివాస్(32) తన తల్లిదండ్రులు ఎల్లయ్య, లక్ష్మీతోపాటు రేగుల శ్రీనివాస్, దేవయ్యలతో కలిసి చింతకాయలు దులుపుతున్నారు. ఇంతలో గాలి వాన రావడంతో అదే చెట్టు కింద కూర్చున్నారు. ఒక్కసారిగా దానిపై పిడుగుపడటంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అలాగే తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్‌కు చెందిన రుద్రారపు చంద్రయ్య(45) తన పొలం వద్ద మోటారు ఫ్యూజులు తొలగించేందుకు వెళ్లగా.. పిడుగుపాటుకు గురై మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కలకొండకు చెందిన పసునూరి ప్రవీణ్(30) తన మామ జంగయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి వెళ్తుండగా వర్షం రావడంతో బస్‌షెల్టర్‌లోకి వెళ్లారు. అదే సమయంలో పిడుగుపడటంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందారు. అక్కడే ఉన్న మాడ్గుల మండలానికి చెందిన గౌని నిరంజన్‌గౌడ్(40) తీవ్రంగా గాయపడ్డారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండండి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు గురువారం సచివాలయం నుంచి అన్ని విభాగాల ఉన్నతాధికారులతో మాట్లాడారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మ్యాన్‌హోల్స్ నిర్వహణ, వరద ముంపు నివారణపై దృష్టిసారించాలని, విద్యుత్ సరఫరా స్తంభించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు.

# జీవన్‌రెడ్డి మాల్ స్వాధీనం

**ఆర్మూర్ పట్టణం:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ స్థలంలో విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ నిర్మించిన జీవన్‌రెడ్డి మాల్‌ను గురువారం ఆర్టీసీ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్టీసీ నిబంధనల ప్రకారం సంస్థతో చేసుకొన్న ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. బకాయిలు చెల్లించడం లేదని ఆర్టీసీ అధికారులు ఈ నెల 9న మాల్‌లోని అద్దె దుకాణదారులకు ప్రకటన జారీ చేశారు. నోటీసులు అందజేయ డంతో అదేరోజు సంస్థ ప్రతినిధులు కొంత మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకు వచ్చారు. దీంతో స్వాధీనం చేసుకొనే నిర్ణయాన్ని వాయిదా వేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులపై విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ యజమాని రజితారెడ్డి భర్త మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇటీవల పలు ఆరోపణలు చేశారు. గురువారం మరోసారి మాల్‌కు వచ్చిన అధికారులు మార్చి 27న పూర్తి బకాయిలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినట్లు పేర్కొన్నారు. గత ఏడాది అక్టోబరు నాటికి రూ.8.65 కోట్ల బకాయిలు ఉండగా.. విడతల వారీగా కొంత మొత్తాన్ని చెల్లించారు. కాగా రూ.2.51 కోట్ల బకాయిలు ఉన్నాయని,




హైకోర్టు ఆదేశాల ప్రకారం నెల రోజుల గడువు ఇచ్చామని, చెల్లించకపోవడంతో నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకొంటామని మధ్యాహ్నం ప్రకటించారు. స్వాధీనం చేసుకొన్నాక, అద్దె దుకాణదారులు ఆర్టీసీతో ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం మాల్, మల్టీప్లెక్స్ భవనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. అద్దె దుకాణదారులు, వినియోగదారులను బయటకు పంపించి గేటుకు తాళం వేశారు. ఈ ఘటన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆర్టీసీ కరీంనగర్ విజిలెన్స్ అధికారి బాబురావు, డిప్యూటీ ఆర్‌ఎం శంకర్, నిజామాబాద్ డీఎం ఆనంద్, ఆర్మూర్ డీఎం ఆంజనేయులు, ఆర్మూర్ ఎస్సై అంజమ్మ, ఆర్టీసీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# అంగన్వాడి సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్



**వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు:** పటాన్ చెరు మండలం కర్ధనూర్ గ్రామంలో మన ఊరి మనబడి అమ్మ ఒడి కార్యక్రమాలు భాగంగా నేడు ప్రాథమిక ఉన్నత పాఠశాల మరియు అంగన్వాడి సెంటర్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అనంతరం వారు మాట్లాడుతూ స్కూల్ మరియు అంగన్వాడి సెంటర్ ఉపాధ్యాయులతో విద్యార్థులకు అందే పోషకాహారాల గురించి తెలుసుకొని వారి స్కూలుకు వచ్చే విద్యార్థి విద్య మరియు ఆరోగ్యం పౌష్టిక ఆహారం గురించి తెలుసుకున్నారు గ్రామ ప్రజల ఫిర్యాదుల మేరకు కర్ధనూర్ గ్రామ చెరువు కుంటల భూములను సర్వేనెంబర్ 155 లో ఉన్న అక్రమ వెంచర్లు సందర్శించి త్వరలోనే అక్రమ వెంచర్ల మరియు తన కట్టడాలు కానీ వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు మరియు గ్రామ ప్రజలకు ఎలాంటి కబ్జాలకు గురికాకుండా చూస్తానని హామీ ఇచ్చారు..

వాయిస్ టుడే
హైదరాబాద్
శుక్రవారం, మే 16, 2024

# తీన్మార్ మల్లన్నని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

## ప్రభుత్వ విప్ అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





**ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):** వరంగల్, ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలోని లక్ష్మీ నరసింహ పంక్షన్ హాల్ లో ఆలేరు నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,ఎమ్మెల్సి అభ్యర్థి తీన్మార్ మలన్న హాజరయ్యారు.ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.బీజేపీ,బీఆర్ఎస్ అభ్యర్థులు నాయకులు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కు పోటీగా ఎక్కడాలేరన్నారు.ఎంపీ గా చామల కిరణ్ కుమార్ కోసం నిరంతరం పని చేశామని.ఇప్పుడు ఎమ్మెల్సీ. గా తీన్మార్ ను గెలిపించటం కోసం పనిచేసి భారీ మెజార్టీ ఇస్తామన్నారు...ఎంపీ చామల తో ఎమ్మెల్సి తీన్మార్ మలన్న ఆధ్వర్యంలో మరిన్ని నిధులు తీసుకుని వచ్చి ఆలేరును అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు.రేపు రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ ఎలక్షన్స్ లో ప్రతి ఒక్క నాయకుడిగా తోడ్పాటుగా ఉంటామన్నారు..మల్లన్న కోసం ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడి లా కష్టపడి పని చేసి భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

# నాదర్గుల్ డీపీఎస్ విద్యార్థుల 100% ఉత్తీర్ణత




**ఇబ్రహీంపట్నం: మే16 (వాయిస్ టుడే)** నాదర్గుల్లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులు సీబీఎస్సీ బోర్డు పరీక్షలో అద్భుతాలు సాధించారు. 100శాతం ఉత్తీర్ణత సాధించడంతో తామెంతో గర్వంగా ఉన్నామని స్కూల్ ప్రిన్సిపాల్ టి. పద్మ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ మల్కా కొమరయ్య మాట్లాడుతూ, ఇంతటి అత్యుత్తమ విజయాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అలాగే స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆయన కొనియాడారు. 2016లో స్థాపించిన నాదగ్గుల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఇంతటి ఘన విజయాలు సాధించడం చాలా సంతోషించాల్సి విషయం. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు యాజమాన్యం ఎప్పుడు సహరిస్తుందని ఆయన అన్నారు. ఈ ఫలితాల్లో 97.2 శాతంతో నిధి జోషి మొదటి స్థానంలో నిలిచింది. 97శాతంతో భువిగ్య రెండో స్థానంలో ఉండగా, మూడోస్థానంలో 96శాతంతో ఆకాశ్ సౌరథ్. జోవన్ పున్నోజ్, లంగటి సుచరిత, సహానా మస్కికార్. అనన్యాసరఫ్ జాస్మిన్ ఉన్నారు. నాలుగో స్థానంలో 95శాతంతో దర్శన్, ఆదిత్య కుమార్ జా. అమిరిశెట్టి పూజిత ఉన్నారు. ఒకరు ఇంగ్లిష్ లో, ముగ్గురు సెకండ్ లాంగ్వేజ్లో, ఇద్దరు గణితంలో నూటికి నూరు మార్కులు సాధించారు. ఫలితాల్లో ముఖ్యాంశాలు– 12 మంది విద్యార్థులు 95శాతం. అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి. జ్యోతి మాట్లాడుతూ సగటున విద్యార్థులంతా అన్ని సబ్జెక్టుల్లో 80శాతానికి పైగా సాధించారన్నారు. 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**గుర్తింపు లేని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి..**

**ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలలో బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్టు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

**ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్**



**సికింద్రాబాద్, మే 16 (వాయిస్ టుడే ప్రతినిధి):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో గుర్తింపు లేకుండా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు నడుపుతున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందనీ ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు లేకుండా ఓపెన్ పర్మిషన్తో సీబీఎస్సీ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నామన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజులు వసులు చేయవలసింది పోయి, ప్రవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలే తనకంటూ ఒక చట్టం ఉన్నట్టుగా ఏర్పాటు చేసుకొని వాళ్లకు నచ్చిన విధంగా ఫీజు వసూలు చేస్తూ విద్యార్థినీ,విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర్నుండి లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందన్నారు. మేడ్చల్ జిల్లాలో ఎల్కేజీ విద్యార్థికి రెండు లక్షల నుండి నాలుగు లక్షల వరకు ఫీజు వసూలు చేస్తున్నట్టు అనేక పత్రికలలో వచ్చినా విద్యాధికారులు ఏ విద్యాసంస్థల్లో ఎన్ని ఫీజులు ఉండాలని బహిర్గతంగా ప్రకటించకపోవడం సిగ్గుచేటనీ, ఇప్పటికైనా విద్యాధికారులే ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థల యజమానులకు నోటీస్ బోర్డ్ లో వాళ్ల ఫీజుల వివరాలు ఉంచే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నామన్నారు. కూరగాయల బేరం ఆడినట్టుగా ప్రైవేట్ కార్పొరేటు పాఠశాల యజమాన్యం ఫీజుల బ్యారాల ఆడుతున్నారనీ, అకాడమిక్ ఇయర్ ప్రారంభం కాకముందే అడ్మిషన్ తీసుకుంటే ఒక విధంగా ఫీజు, ప్రారంభం అయిన తర్వాత అడ్మిషన్ తీసుకుంటే మరోలాగా ఫీజు వసూలు చేసే దుస్థితి విద్యాసంస్థల్లో రావడం సిగ్గుచేటనీ అన్నారు. ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలలో బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్ట్, అమ్ముతున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని పాఠశాలలో బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్టు అమ్మడం నేరమైనప్పటి కూడా పాఠశాల యజమానులు అమ్ముతూ దోపిడీ చేస్తున్నా చూసి చూడనట్టుగా విద్యాధికారులు వున్నారని, ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో పేద,బడుగు బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా పోరాటం రూపొందిస్తామని హెచ్చరించారు.

# వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి: డిప్యూటీ మేయర్



**సికింద్రాబాద్, మే 16 (వాయిస్ టుడే ప్రతినిధి):** నగరంలో పలు చోట కురుస్తున్న వర్షాల నేపథ్యం లో జీహెచ్ఎంసీ అధికారులు, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్రెడ్డి ఆదేశించారు. వర్షం కారణంగా పలుచోట్ల రోడ్లపై నిలిచిపోయిన నీటిని డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగిస్తున్నారని చెప్పారు. రోడ్లపై నిలిచిన నీటితో పాటు విరిగిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు అందరూ తమ తమ ప్రాంతాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని కోరారు జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయి సిబ్బందికి వెంటనే తెలిపి, వాటి పరిష్కారానికి తగిన చర్యలను తక్షణమే తీసుకోవాలని ఆదేశించారు. నగరం పరిధిలో ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే జీహెచ్ఎంసీ కాల్సెంటర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

# అక్రమంగా పదోన్నతులు పొందిన వారిని వీసీలుగా నియమించకూడదు: ఏఐఎస్ఎఫ్



**సికింద్రాబాద్, మే16 (వాయిస్ టుడే ప్రతినిధి):** యూనివర్సిటీలలో అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన వారిని వైస్ చాన్సలర్లుగా నియమించకూడదని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. బోధన, పరిపాలనా అనుభవం ఉన్నవారినే వీసీలుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, అంబేద్కర్, జేఎన్టీయూ యూనివర్సిటీలలో కొంతమంది ప్రొఫెసర్లు అర్హత లేకపోయినా అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారని వివరించారు. అటువంటి వారిని రాష్ట్రంలో ఏ యూనివర్సిటీకి వీసీలను నియమించడంలో పరిగణనలోకి తీసుకోకూడదని విజ్ఞప్తి చేశారు. వీసీ పదవీకాలం ముగియకముందే నోటిఫికేషన్ జారీ చేసి, సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేసి, వీసీ నియామక ప్రక్రియను చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. విద్యాబోధన చేస్తూ, విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రొఫెసర్లు పదోన్నతుల కోసం అక్రమాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో చాలా మంది వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఒక ప్రొఫెసర్ పదోన్నతి ద్వారా సీనియర్ ప్రొఫెసర్ కావాలంటే యూజీసీ కేర్ లిస్ట్, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ వంటి రీసర్చ్ జర్నల్స్ లో కనీసం పది పరిశోధనా పత్రాలు ప్రచురితమై ఉండాలని, దాంతో పాటు ఆ ప్రొఫెసర్ పర్యవేక్షణలో కనీసం ఇద్దరు పీహెచ్ఏ పూర్తి చేసి ఉండాలని వివరించారు. ఈ అర్హతలు లేకున్నా కొంతమంది పదోన్నతులు పొందారని ఆరోపించారు. వారిలో ప్రస్తుత ఉన్నత విద్యామండలి పెద్దలు, కొన్ని యూనివర్సిటీలకు వీసీలుగా పనిచేస్తున్నవారు సైతం ఉన్నారని తెలిపారు, వారికి ప్రస్తుత వీసీ నియామకాల్లో అవకాశం కల్పించకూడదన్నారు. పదోన్నతుల ద్వారా ఆర్జించిన వేతనాన్ని ఆయా యూనివర్సిటీలు రికవరీ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు లెనిన్, భగత్, శేఖర్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ఉద్యమిస్తాం..

## తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్



**సికింద్రాబాద్, మే 16 (వాయిస్ టుడే ప్రతినిధి):** కామారెడ్డి బీసీ డిక్లరేషన్ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోకకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దానిని అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తే తెలంగాణ రాష్ట్రంలో మరొక ఉద్యమాన్ని ఆరంభిస్తామని హెచ్చరించారు త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పేర్కొందని గుర్తు చేశారు. దాని ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. బీసీల ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని అభిప్రాయపడ్డారు ఇప్పటికే రాష్ట్రంలో మంత్రివర్గం, నామినేటెడ్ పదవుల్లో రెడ్లకు పెద్దపీట వేశారని ఆరోపించారు. బీసీలకు మాత్రం మొండిచేయే ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో సామాజిక న్యాయం కొరవడిందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా మంత్రివర్గం, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం పదవులు కట్టబెట్టాలని డిమాండ్ చేశారు.

# కుందారం గణేష్చారికి విశ్వ బ్రాహ్మణ సేవా రత్న అవార్డు



**సికింద్రాబాద్, మే 16 (వాయిస్ టుడే ప్రతినిధి):** సుదీర్ఘంగా గల్లి నుండి ఢిల్లీ వరకు గత 40 సంవత్సరాలుగా విశ్వబ్రాహ్మణ జాతికి సేవలందిస్తున్న బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కి విశ్వ బ్రాహ్మణ సేవారత్న అవార్డు వరించింది. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ స్పీకర్ మధుసూదనాచారి, వేములవాడ మదన్, త్రిమూర్తుల గౌరీ శంకర్, సంగమేశ్వర రావు, మహాత్మ కృష్ణమాచారి, రవీందర్ చారి, శంకరాచారి, తాటికొండ శ్రీనివాస్ చారి, విశ్వబ్రాహ్మణ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ రాముడు నరసింహాచార్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతికి సేవలందిస్తున్న కుందారం గణేష్ చారి కి విశ్వబ్రాహ్మణ సేవా రత్న అవార్డు తో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం నాకు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్ సెట్ రిజిస్ట్రేషన్ ఫీజులను తగ్గించాలి




**సికింద్రాబాద్, మే 16 (వాయిస్ టుడే ప్రతినిధి):** ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ స్టేట్ లెవల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) రిజిస్ట్రేషన్ ఫీజులను తగ్గించాలని బీఆర్ఎస్వీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డికి బీఆర్ఎస్వీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సెట్ అర్హత పరీక్షకు హాజరుకాబోయే విద్యార్థుల నుంచి అధిక ఫీజులు చేయడం అన్యాయమన్నారు. జనరల్ కేటగిరికి రూ. 2000, బీసీలకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్లకు రూ.1000 ఫీజు పసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఎటువంటి ఫెలోషిప్లు ఇవ్వకుండా, విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేయాలని భావించడం భావ్యం కాదన్నారు. ఆ ఫీజులు చెల్లించలేక విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వాపోయారు.

ప్రభుత్వ యూనివర్సిటీలలో సామాన్య, మధ్యతరగతి, నిరుపేద విద్యార్థులకు సెట్ అర్హత సాధించాలనే కల కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ ఉద్యోగ భర్తీ సన్నద్ధమవుతూ భారీగా ఖర్చు చేస్తున్న తరుణాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు కొంపల్లి నరేశ్, పెద్దమ్మ రమేశ్, శ్రీనునాయక్, కాటం శివ తదితరులు పాల్గొన్నారు.

# మనికేశ్వరినగర్ లో శ్రీశ్రీశ్రీ ఈదమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ట మహోత్సవానికి హాజరైన డిప్యూటీ మేయర్



**సికింద్రాబాద్, మే 16 (వాయిస్ టుడే ప్రతినిధి):** సికింద్రాబాద్ నియోజకవర్గం లోని తార్నాక డివిజన్ మాణికేశ్వరీనగర్లోనీ శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ ఈదమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ట మహోత్సవానికి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్రెడ్డి దంపతులు హాజరయ్యారు. అనంతరం సొసైటీ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని, అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నగర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు.

# అక్రమ నిర్మాణాలను కూల్చిన జీహెచ్ఎంసీ అధికారులు



**సికింద్రాబాద్, మే 16(వాయిస్ టుడే ప్రతినిధి):** తార్నాక డివిజన్లో అక్రమ నిర్మాణాలపై చర్యలకు జీహెచ్ఎంసీ అధికారులు నడుం బిగించారు. డివిజన్లోని లాలాపేటలో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మించారు. దీనిపై వివిధ పత్రికలలో కథనాలు ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు ఆ షెడ్డును కూల్చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రజిత మాట్లాడుతూ షెడ్డు నిర్మాణంపై తమకు పిర్యాదు అందిందని చెప్పారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు షెడ్డును కూల్చే తెలిపారు. ఎవరైనా భవన నిర్మాణాలు చేపడితే నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

# పాఠశాల సిబ్బందికి ప్రతినెల మొత్తం వేతనాన్ని అందించిన శ్రీరంగం ఫౌండేషన్




**కూకట్ పల్లి : మే 16(వాయిస్ టుడే):** కూకట్ పల్లి నియోజకవర్గం కేపీహెచ్ బి కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజ కుమారి గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు, అదేవిధంగా పాఠశాలలోని తరగతి గదులు శుభ్రం చేసే వ్యక్తికి వేతనాన్ని ఇవ్వమని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం ను కోరగా అందుకు శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2023 –2024 విద్యా సంవత్సరానికి గాను ప్రతి నెల వేతనాన్ని ఇస్తామని ఇచ్చిన మాట ప్రకారం మే నెల వేతనాన్ని కూడా శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతుల మీదుగా వారి కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిందితుడు బొడ్డు సంపత్‌యాదవ్‌ను రిమైండ్ తరలింపు ..



**జూబ్లీహిల్స్ 16 మే (వాయిస్ టుడే):** 15వ తారీఖు బుధవారం నిమ్స్ మే మైదానంలో కత్తులతో పొడిచి వరుణ్ తేజ్ అనే మేకప్ బాయ్ ను చంపిన నిందితుడు బొడ్డు సంపత్ యాదవ్ అలియాస్ (బిట్టు) వయస్సు 19 సంవత్సరాలు తండ్రి నరసింహ యాదవ( బిసి) రహమత్ నగర్ లోని హార్?డ్వర్ షాపులో ప్రైవేటు ఉద్యోగి నిందితుడిని అరెస్టు చేసి గురువారం బోరబండ పోలీసులు రిమాండ్కు తరలించారు.

# రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలి, 500బోనస్ చెల్లించాలి



**షాద్ నగర్ /వాయిస్ టుడే /మే 16:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు స్థానిక మాజీ శాసన సభ్యులు అంజయ్య యాదవ్ ఆదేశాల మేరకు మండల బిఆర్ఎస్ అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్ పట్టణ అధ్యక్షులు ఎం. ఎస్. నట రాజన్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా సన్న వడ్లతో పాటు దొడ్డు వడ్లకు కూడా 500 రూపాయల బొనస్ చెల్లించాలని రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మార్కెట్ లో వడ్లు అమ్మడానికి వచ్చిన రైతులతో ముఖాముఖి జరపగా వాళ్ళు గతంలో ఇదే సీజన్ లో 3,300/- పలికిన వడ్ల ధర ఈ సారి ప్రభుత్వం 2,300/- ధర నిర్ణయించిన మార్కెట్‌లో 1700, 1800 రూపాయలకే కొంటమంటున్నారు అనీ వాపోయారు. ఇట్టి విషయమే మార్కెట్ సెక్రెటరీ గారికి రైతులకు న్యాయం చేసే విధంగా కొనుగోలు జరగాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ నరేందర్, సింగిల్ విండో చైర్మన్ బక్కన యాదవ్, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ తాండ్ర వెంకట్ రెడ్డి, నాయకులు మన్నె నారాయణ యాదవ్, రాయికల్ వెంకట్ రెడ్డి, పల్లె శ్రీనివాస్ రెడ్డి, బిశ్వ రామకృష్ణ,శ్రీశైలం యాదవ్, గోపాల్ యాదవ్, చందు నాయక్, కమ్మదనం కిరణ్, అలోనిపల్లి శ్రీనివాస్ గౌడ్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, రేటికల్ నందీశ్వర్, చిపిరి రమేష్ యాదవ్, బొమ్ము రంగయ్య గౌడ్, బుగ్గ కృష్ణ, రాఘవేందర్, కాట వీరేశం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అధైర్యపడవద్దు, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి అధికారులు బాయిల్డ్ మిల్లులకు తరలించే విధంగా చూసె బాధ్యత సొసైటీ సి ఈ ఓ లాదే

**లారీలలో ధాన్యాన్ని వెంటనే అన్ లోడ్ చేసి ట్రక్ షీట్ వెంటనే జారీచేయాలని మిల్లర్లకు ఆదేశాలు జారీ....**

**ఇప్పటి వరకు 42,142 మంది రైతుల నుంచి 526 కోట్ల విలువ గల 2,38,488 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు...**

**84% మేర 441 కోట్లు రైతుల ఖాతాలో జమ...అదనపు కలెక్టర్ చంద్ర మోహన్**



**కామారెడ్డి బ్యూరో మే 16 వాయిస్ టుడే:** అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వలు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని జెసి చాంబర్లు గురువారం రెవెన్యూ, జిల్లా పౌర సరఫరాల అధికారులతో ధాన్యం కొనుగోల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే మూడు రోజులు వర్షాలు కురిసే సూచనలున్నందున ధాన్యం రాశులను త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని అధికారు లను ఆదేశించారు. రైతులు కూడా ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఎగిరిపోకుండా చూసుకోవాలని కోరారు. రైతులు అధైర్యపడవద్దని, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి అధికారులు బాయిల్డ్ మిల్లులకు తరలించే విధంగా చూడాలన్నారు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం తగ్గేలా చూడాలన్నారు. లారీలలో ధాన్యాన్ని వెంటనే అన్ లోడ్ చేసుకోవాలని, ట్రక్ షీట్ జారీచేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా మిల్లులకు వచ్చిన లారీలను 24 గంటల లోగా అన్ లోడ్ చేసుకొని త్రిప్పి పంపితే తిరిగి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం లోడింగ్ చేసి పంపడానికి అవకాశముంటుందని అన్నారు. ఈ రబీ సీజన్ లో ఇప్పటి వరకు 42,142 మంది రైతుల నుంచి 526 కోట్ల విలువ గల 2,38,488 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ త్వరితగతిన చేస్తూ 84 శాతం మేర 441 కోట్లు రైతుల ఖాతాలో జమచేశామని చేశామని, మిగతా డబ్బులు రైతుల ఖాతాలో త్వరలో జమచేస్తామని చంద్ర మోహన్ తెలిపారు.

వడ్ల కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేస్తూ త్వరగా డబ్బులు ఖాతాలో జమ చేసే విధంగా చూడాలని జెసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇన్చార్జి జిల్లా పౌరసరపరాల మేనేజర్ నిత్యానందం, ఉప తహసీల్ధార్లు పాల్గొన్నారు.

# డెంగ్యూ లక్షణాలు ఉంటే వైద్యుని సంప్రదించండి




## జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీ

**షాద్ నగర్/వాయిస్ టుడే/మే 16:** జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా గురువారం షాద్ నగర్ డివిజన్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి వైద్య సిబ్బంది ర్యాలీ ప్రారంబించారు. ర్యాలీ సంధర్భంగా డాక్టర్ కార్తీక్ ఆద్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఫరూఖ్ నగర్ లోని వీధుల గుండా దోమలను అరికట్టే విధానాల స్లొగన్స్ ఇస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యమే -మహాభాగ్యం, దోమ పుట్ట రాదు- దోమ కుట్ట రాదు అంటూ నినాదాలు చేస్తూ ప్రతి శుక్రవారం- డ్రై డే పాటించండని తెలిపారు. అనంతరం ఫరూఖ్ నగర్ లోని గాంధీ బొమ్మ దగ్గర మానవహారం నిర్వహించారు. ఈ మానవ హారంలో బాగంగా జే శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ డెంగు వ్యాధి ఎడిస్ ఈజిప్ట్ దోమ కాటు వలన వస్తుందని చెప్పారు. డెంగు లక్షణాలు: అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం , తీవ్రమైన తలనొప్పి, కల్లా వెనుక భాగంలో తీవ్రమైన నొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, శరీరం మీద దద్దుర్లు రావడం, వికారం, వాంతులు కావడం, చికెన్ గన్యాలు జాయింట్ పెయింట్స్ ఎక్కువ ఉంటాయని జె. శ్రీనివాసులు అని చెప్పారు. డెంగ్యూ జ్వరము లక్షణాలు తీవ్రమైన కడుపునొప్పి, మనిషి ఒక్క సారిగా చల్ల బడి పోవడం , పాలి పోయినట్లు ఉండడం, వాంతులు , నిద్రలేమి , అధిక దాహం , నాడి బలహీనంగా ఉండటం, శ్వాస కష్టంగా ఉండటం, పిల్లల్లో ఎప్పుడూ ఏడుస్తూ ఉండడం, పై లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ని సంప్రదించాలని చెప్పారు. వ్యాధికారక దోమలు కుట్టిన ప్రతి మనిషి బాధితుడేననారు. వ్యాధి వచ్చే అవకాశం పిల్లల్లో ఎక్కువగా ఉంటుందన్నారు. డెంగ్యూ దోమ నల్లటి శరీ రంతోటీ , తెల్లని చారులు కలిగి ఉంటుందని, దీనిని టైగర్ దోమ అని కూడా అంటారన్నారు. ఇది పగటి పూట కుడుతుందన్నారు. దోమలు ఎక్కువగా ఎక్కడ అభివృద్ధి చెందుతాయంటే చల్లగా, చీకటిగా ఉండే ప్రదేశాలలో, నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో, మంచినీటిలో అభివృద్ధి చెందు తాగి అని తెలియజేశారు. స్కూలు పిల్లలు, ఉపాధ్యాయులు, ఆయా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. గ్రామాలలో ఇండ్లు చుట్టు , పరిసరాలు పరిశ్రమంగా ఉంచు కున్నట్లయితే దోమలు పెరగవని హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ , డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ జే శ్రీహరి, హెల్త్ సూపర్వైజర్లు చంద్రకళ, అమృత , ఫార్మసిస్టు ఉదయ్ కుమార్, చిన్ చోడ్ ఏఎన్ఎంలు, ఆశాలు మరియు పి.పి యూనిట్ ఆశాలు , డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆఫీస్ సిబ్బంది ఝాన్సీ, గౌస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్‌బిసిఐ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఉచిత భూసార పరీక్షలు




**సైదాపూర్: (వాయిస్ టుడే)** మండల పరిధిలోని ఆకునూర్ గ్రామంలో డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ ఇండియా (బీసీఐ ) ఉత్తమ పత్తి యజమాన్య పథకం నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో భూసార పరీక్ష మేళా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త సాయికిరణ్ మాట్లాడుతూ మానవులకు రక్త పరీక్ష ఏ విధంగానో అదే విధంగా నేల తల్లికి కూడా మట్టి పరీక్ష అంతే ముఖ్యం అని కాబట్టి రైతుల భూసార పరీక్షలు నిర్వహించుకుని నేల ఆరోగ్య స్థితి ఏ విధంగా ఉందో తెలుసుకోవాలని అన్నారు. ఇందులో భాగంగా నేలలో ఉన్న నత్రజని,భాస్వరం,పొటాషియం వాంటి స్థూల పోషకాల సామర్థ్యం తెలుసుకొని వాటి ఫలితాల ఆధారంగా సూచించిన మోతాదులో ఎరువులు వాడుకోవాలని అన్నారు. గురువారం భూసార పరీక్షలు నిర్వహించిన ఫలితాలలో ముఖ్యంగా భాస్వరం ఎరువు అనేది అధికంగా ఉన్నందువలన రానున్న రోజుల్లో భూమి చౌడుగా మారే అవకాశం ఉన్నందువలన బాస్వరం ఎరువును తగ్గించుకొని పి ఎస్ బి వాడుకోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి వచ్చిన రైతులకు మట్టి పరీక్షల నిర్వహించి అప్పటికప్పుడు రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు మరియు బీసీఐ క్షేత్ర సిబ్బంది రమేష్, రజిత, లత పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఏసీబీ నాగభూషణం

**బస్సులో ఫుల్‌గా తాగిన మైకంలో భర్త వేధింపులు భరించలేక రన్నింగ్ బస్సులోంచి దూకిన భార్య**



**షాద్ నగర్/వాయిస్ టుడే /మే 16:** రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండల కేంద్రం సమీపంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. అపుడే అటుగా వస్తున్న శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం.అపస్మారక స్థితి లో ఉన్న ఆమెను అంబులెన్సు రావటం లేట్ కావడం తో ఏసీపీ గా ఆటోలో ప్రభుత్వ హాస్పిటల్ షాద్ నగర్ తరలించారు. గాయపడిన మాహిళ పేరు మర్యం భర్త దస్తగిరి హస్నాబాద్, కొడంగల్ తలకు బలమైన గాయం గాయం కావటం తో షాద్ నగర్ లో ప్రాథమిక చికిత్స అనంతరం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కు మెరుగైన చికిత్సకై తరలించారు.తక్షణమే స్పందించిన ట్రాఫిక్ పోలీస్‌లను బస్సు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు..

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



**మక్తల్ మే 16 వాయిస్ టుడే ప్రతినిధి:** జిల్లాలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతుల ఆదుకోవాలి. అసలే వర్షాభావ పరిస్థితుల వల్ల మరియు ఈసారి రోగాల బారినపడి దిగుబడి తగ్గిపోయి ఇబ్బందుల్లో ఉన్న రైతులు,పెట్టిన పెట్టుబడి రాక లబోదిబోమంటున్నారు. అలాగే అకాల వర్షాలు మరింత కుంగదీశాయి. తేమశాతం సంబంధం లేకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వము క్వింటాల్ కు 500 బోనస్ చెల్లించాలి, లేని పక్షాన రైతు పక్షపాతిగా పోరాటం చేస్తామని తెలుగుదేశం పార్టీ తరుపున హెచ్చరిస్తున్నాం. మధుసూదన్ రెడ్డి పాలమూరు పార్లమెంట్ నియోజక వర్గ ఉపాధ్యక్షులు.

# వర్షానికి తడిసి ముద్దయిన వడ్లు.. రైతన్న ఆగమాగం

**వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా, మే 16:** రాజాపూర్ మండలం ఆరుగాలం శ్రమించి వడ్లను పండిస్తే ఆరబెట్టేందుకు రోడ్డుపై వేసిన వడ్లు గురువారం కురిసిన అకాల వర్షానికి తలసి ముద్దయ్యాయి. గత కొన్ని రోజులుగా వడ్లు ఎండబెట్టడంతో గురువారంతో పూర్తిగా ఎండిపోయాయి అని సంబరపడ్డ రైతులు అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయారు. గురువారం కురిసిన వర్షానికి రాజపూర్ మండల కేంద్రానికి చెందిన పాలమోని తిరుపతయ్యకు చెందిన దాదాపు 150 బస్తాల వడ్లు తడిసి ముద్దయ్యాయి. దీంతో ఆ రైతు లబోదిబోమంటూ వర్షంలోనే తడిసిన వడ్లను ఒకే దగ్గరికి చేయాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని తిరుపతయ్య వేడుకుంటున్నాడు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవంపై అవగాహన ర్యాలీ



**వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా మే.16:** నవాబుపేట ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నరేష్ చంద్ర ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ తీయడం జరిగింది. ఆపరేషన్ డెంగు ప్రతిజ్ఞ కూడా చేయించడం జరిగింది.డెంగ్యూ వ్యాధి నివారణ, వ్యాధి సంక్రమణ, వ్యాధి లక్షణాలు, సంబంధించిన పరీక్షలు,నివారణ చర్యల్లో భాగంగా వ్యక్తిగతంగా మరియు సామాజికపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి డాక్టర్ వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాములు, ఎం పి హెచ్ ఈవో బాలమ్మ , పి.హెచ్.ఎన్ కలమ్మ , శ్రీనివాస్ హెచ్ఎస్ కె.శరభలింగం , రాఘ వేం దర్, అవినాష్ వినోద్, వాహబ్, పుష్ప, ఇందిర, రాములమ్మ, రజిత ,కృష్ణవేణి, శకుంతల సువార్త మరియు ఆశా కార్యకర్తలు నిర్మల తదితరులు పాల్గొన్నారు

## సీనియర్ జర్నలిస్టును పరామర్శించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట ,మే16 (వాయిస్ టుడే ప్రతినిధి):** గత కొద్దిరోజుల క్రితం గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేసుకున్న సీనియర్ జర్నలిస్టు రాపర్తి కేశవ్ గౌడ్‌ను మాజీ విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు. గుంత కండ్ల జగదీశ్ రెడ్డి గురువారం పరామర్శించారు. మానస నగర్ లోని కేశవ గౌడ్ నివాసానికి విచ్చేసిన ఆయన ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. త్వరలో పూర్తి ఆరోగ్యవంతుడిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్థికపరమైన సహాయాన్ని ఆయన అందించారు. ఆయన వెంట జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల కరుణాకర్ రెడ్డి, టిఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక రేట్లకు స్టాంప్ విక్రయాలు

**భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం, జూలూరుపాడు, పాల్వంచ, చంద్రుగొండ, సుజాతనగర్ మండలాల్లోని స్టాంపు విక్రయదారులు 100 రూపాయల స్టాంపులను 150 రూపాయలకు , 50 రూపాయల స్టాంపులు 80 రూపాయలకు, 20 రూపాయల స్టాంపులను 60 రూపాయల చొప్పున విక్రయిస్తూ కొనుగోలుదారుల జేబులను కొల్లగొడుతున్నారు. కొత్తగూడెం సబ్ రిజిస్టర్ కార్యాలయం నుండి స్టాంప్ లు కొనుగోలు చేసే ఏజెంట్లు దాదాపు 45 మంది ఉన్నారు. అయితే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్టాంపు లు అందుబాటులో లేకపోవడంతో చాలామంది విక్రయదారులు ఏజెంట్ల నుండి స్టాంపులను కొనుగోలు చేస్తున్నారు.ఇదే అదునుగా చేసుకొని ఏజెంట్లు వాళ్ల ఇష్ట రీతిలో స్టాంపులను విక్రయిస్తున్నారు. ఇదేమిటి అని అడిగితే ఏజెంట్ల సమాధానం ఆఫీస్ మొదలుకొని ఎన్నో రకాల ఖర్చులున్నాయి.అందుకనే ఈ రేట్లకు అమ్ముతు న్నామని అనడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్టాంపు విక్రయ ఏజెంట్ల పై శాఖా పరమైన చర్యలు తీసుకొని స్టాంపు కొనుగోలుదారుల జేబులకు చిల్లు పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

## ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

### ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కృష్ణ యాదవ్



**వాయిస్ టుడే మే 16 (సిద్దిపేట్ జిల్లా ప్రతినిధి ):** రాష్ట్రంలో ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్ రామ్ రెడ్డి లక్ష పైచిలుకు మెజారిటీతో విజయం సాధించనున్నారని మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కృష్ణ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.మండల కోఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహెర నరేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నాటి నుండి పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసామని, నిద్రాహారాలు మాని బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం పనిచేశామని దానికి ప్రతిఫలం జూన్ 4వ తారీఖు తెలుస్తుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ, ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పది లక్షలకు పైగా మంది లబ్ధిదారులు అనేక పథకాల ఫలాలు పొందారని తెలిపారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉచిత పథకాలు పొందిన ప్రజలు ఎక్కువ శాతం బిఆర్ఎస్ కు ఓటు వేశారని,ప్రశాంతంగా ఓటింగ్ పెద్ద ఎత్తున జరగడంతో బీఆర్ఎస్ సునాయాసంగా విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్ని మాయ మాటలు చెప్పిన ప్రజలు బిఆర్ఎస్ వైపే ఉన్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉచిత హామీల తో వచ్చి,అమలు విషయంలో విఫలమైందని,కాంగ్రెస్ పార్టీ మీద ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మీడియా ముఖంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎటు వంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలపై ఉన్న వ్యతిరేకత తమకు సానుకూలంగా మారిందని విశ్లేషించారు. సోమవారం జరిగిన లోక్ సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం పాములపర్తి గ్రామంలో ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణను బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేపించారని ఆరోపించడం సరికాదని,బిజెపి నాయకులు చిన్న తోపులాటగా జరిగిన విషయాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని అన్నారు.

## మాచారెడ్డి, వేలుపుగొండ, ఫర్దీపేట, బీబీపేట, దోమకొండలలో

# కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనకి...

**కామారెడ్డి బ్యూరో మే 16 వాయిస్ టుడే:** అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యాన్ని త్వరత్వరగా ట్యాగింగ్ చేసిన మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. గురు వారం పలు మండలాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ తో కలిసి పరిశీలించి తూకం వేసి సిద్ధంగా ఉంచిన ధాన్యపు బస్తాలను వెంటనే తరలించాలని, ఇందుకు అవసరమైన లారీలను కేంద్రాలకు పంపవలసినదిగా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ముందుగా మాచారెడ్డి మండలంలోని వేలుపుగొండ, ఫర్దీపేట, బీబీపేట, దోమకొండ లలో కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ధాన్యంలో తేమ శాతాన్ని కొలిచి, తూకం చేసే ప్రక్రియను పరిశీలించారు. కేంద్రంలో ఏమైనా సమస్యలున్నాయా అని నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలతో తల్లడిల్లుతున్న రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన రైస్ మిల్లులకు వెంట వెంటనే తరలిస్తూ మిల్లర్లు కూడా 24 గంటలలోగా ధాన్యం దించుకునేలా పర్యవేక్షించాలని, టాబ్ ఎంట్రీ త్వరితగతిన చేయాలని అధికారులకు సూచించారు .రైస్ మిల్లర్లు కూడా హమాలీలలను ఎక్కువగా పెట్టుకొని లారీలు వచ్చిన 24



గంటలలోగా ధాన్యం దించుకోవాలని, ఎట్టిపరిస్థితులలో మిల్లుల వద్ద లారీలు వేచి ఉండరాదని, త్వరగా దించుకుంటేనే తిరిగి లోడింగ్ చేయడానికి అవకాశాముంటుందని స్పష్టం చేశారు. అకాల వర్షాలవల్ల ధాన్యం కాస్త చెడిపోయిన రైతుల పరిస్థితులను అర్థం చేసుకొని ప్రభుత్వం ఆదేశాల మేరకు ధాన్యాల్లో ఎటువంటి కోత విధించకుండా అన్ లోడ్ చేసుకొని ట్రక్ షీట్ జారీచేయాలన్నారు. మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవడంలేదని అపవాదులను తావివ్వకుండా ధాన్యం వచ్చిన వెంటనే దించుకోవాలని, ప్రభుత్వ పరంగా సహకారమందిస్తామన్నారు. తహసీల్దార్లు, గిర్దావర్లు, సూపర్వైజరి అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. టార్పాలిన్లు, గన్ని సంచులు, లారీల సమస్య తలెత్తకుండా నిరంతరం మానిటరింగ్ చేస్తున్నామని, ఈ పక్షం రోజులు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా అధికారులందరూ అప్రమత్తం గా ఉండి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతి రోజు కొనుగోళ్లు ఆగకుండా,రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి సమస్య రాకుండా నిరంతరం పర్యవేక్షించవలసినదిగా ఆదేశించారు. . ప్రస్తుత విపత్కర పరిస్థితులలో అధికార యంత్రాంగం యావత్తు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తూ, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించాలన్నారు. ఏమైనా ఇబ్బందులైతే కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులకు కష్టం కలగకుండా అకాల వర్షాలు పడుతున్నా రాత్రి పొద్దుపోయే వరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. గత యాసంగితో పోలిస్తే ఈ యాసంగి లో ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 44,182 మంది రైతుల నుండి 541 కోట్ల విలువ గల 2 లక్షల 46 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 474 కోట్లు చెల్లించామని, ట్యాబ్ ఎంట్రీ కూడా 96 శాతం మేర పూర్తి చేశామని, త్వరలో మిగతా రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, ఇంచార్జి జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు ఉన్నారు.

## కులవర్గ జమిలి పోరాటాల సిద్ధాంతకర్త మారోజు వీరన్న 25వ వర్ధంతి

**వాయిస్ టుడే మే 16( సిద్దిపేట జిల్లా ప్రతినిధి:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని (టౌన్) ప్రెస్ క్లబ్ లో కులవర్గ జమిలి.. పోరాటాల సిద్ధాంతకర్త కామ్రేడ్ మారోజు వీరన్న చిత్రపటానికి బహుజన కమ్యూనిస్టు పార్టీ , బి డి ఎస్ ఎఫ్ ,బహుజన మహిళా సంఘం , బి ఎఫ్ టి యు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బి ఎఫ్ టీ యూ రాష్ట్ర అధ్యక్షులు చిట్యాల మధు. సీనియర్ ఉద్యమ నాయకులు సత్తయ్య సార్ లు మాట్లాడుతూ ఆయన దళిత ఉద్యమాలు, మండల్ ఉద్యమం, తెలంగాణ సాధన ఉద్యమం లలో మమేకమైనారు. భౌగోళిక తెలంగాణ రాష్ట్రంలో బహుజనుల సామాజిక తెలంగాణ ఏర్పాటుకు కార్యాచరణ చేశారు. మేమెంత మందిమో మాకంత వాటా కావాలని సామాజక, రాజకీయ పంపిణీ న్యాయ సూత్రంతో ముందుకురికారు. జనశక్తి పార్టీని దళిత బహుజన కమ్యూనిస్టు పార్టీగా పరివర్తన చెందించాలని ఆ పార్టీలో 1995 మే 17 నుంచి 1998 వరకు అంతర్గత పోరాటం చేశారు.భౌగోళిక తెలంగాణ రాష్ట్రంలో



బహుజన రాజ్యం ఏర్పడాలనే లక్ష్యం, నినాదంతో మారోజు వీరన్న తెలంగాణ మహాసభను స్థాపించారు. 1997 ఆగస్టు 11న సూర్యాపేట పట్టణంలో వేలాది మందితో తెలంగాణ రాష్ట్ర సదస్సు నిర్వహించి, తెలంగాణ రాష్ట్ర సాధన మలి దశ ఉద్యమానికి ఆ రోజు మారోజు ఊపిరులూదారు. అణగారిన కులాలు, జాతులు, తెగలను ఐక్యం చెయ్యడానికి దళిత బహుజన మహాసభ స్థాపించారు. ఐక్య రాజకీయ ఉద్యమాల నిర్వహణ కోసం మహాజన ఫ్రంట్‌ను రూపొందించారు. విద్యార్థులను బహుజన రాజ్య నిర్మాణానికి కార్యోన్ముఖులను గావించడానికి 1998 ఆగస్టు 18న బహుజన ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (బి డి ఎస్ ఎఫ్) స్థాపించారు. చారిత్రక అస్తిత్వ ఉద్యమమైన లాల్ నిల్ నినాదంతో అనేకమైన కుల సంఘాలను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (మాదిగ హక్కు దండోరా) లంబడి హక్కుల పోరాట సమితి, గొల్ల కురుమ డోలు దెబ్బ, సాకిరేవు (చాకలి) దెబ్బ, మోకి దెబ్బ (గౌడ), గన్నుదెబ్బ(వడ్డెర), మాల గుతప దెబ్బ, తదితర కుల సంఘాలను కామ్రేడ్ మారోజు వీరన్న నిర్మాణం చేయడం జరిగింది. దీంతో అనేక కుల సంఘాలను నిర్మాణం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి డి ఎస్ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బెట ఆనంద్. ప్రజా సంఘాల నాయకులు దుర్గా రాములు.బి ఎఫ్ టీ యూ సిద్దిపేట జిల్లా కన్వీనర్ శివరాత్రి శ్రీనివాస్, సాడిమల డేవిడ్, గాలి రాజేష్. బహుజన మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ కొండ వర్ష , మారోజు వీరన్న సహచరులు గడ్డం మోహన్ రెడ్డి, డప్పు చంద్రం సిద్దిపేట నియోజకవర్గ ముదిరాజ్ జెఏసి చైర్మన్ పడిగే ప్రశాంత్,రావుల రాజు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ పట్టణంలోని బిఆర్ఎస్ కార్యకర్తల ధర్నా

**వాయిస్ టుడే మే 16( సిద్దిపేట జిల్లా ప్రతినిధి):** గజ్వేల్ నియోజకవర్గం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖరరావు ఆదేశాల మేరకు రైతులు పండించిన సన్న వడ్లకు దొడ్డ వడ్లకు 500 బోనస్ వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గజ్వేల్ లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున రైతులతో కలిసి ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అసత్యపు వాగా ద్నాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ లేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తూ రైతుల యొక్క నడ్డి విరిచే ప్రయత్నాన్ని చేస్తుందన్నారు, కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు రైతులకు గిట్టుబాటు ధరలను కల్పిస్తూ వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామనం దానితోపాటు ప్రత్యేక ప్రతి క్వింటాల్ వరి ధాన్యానికి 500 బోనస్ ను ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ దానిని బోగస్ వాగ్దానంగా మార్చి తప్పించుకుంటుందని మండిపడ్డారు, కాంగ్రెస్ వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కరువు ఏర్పడింద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కరెంటు రాక బోరు మోటర్లు కాలిపోతున్నాయన్నారు ట్రాన్స్ఫార్మర్లు పేలిపోతున్నా యన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల కరెంటు ఎనిమిది తొమ్మిది గంటలకు మాత్రమే పరిమితమైందన్నారు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని చెరువులు కుంటలు చెక్ డ్యాములు ప్రాజెక్టులు ఎడారులుగా మారాయి అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీళ్లు లేక రైతుల యొక్క పంట పొలాలు ఎండిపోయాయన్నారు త్రాగునీటి సమస్య ఏర్పడింది అన్నారు కాంగ్రెస్ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రం యొక్క ఆర్థిక వ్యవస్థ దిగజారింది అన్నారు, కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసపూరిత హామీలు అబద్ధపు వాగ్దానాలు మోసపూరిత కుట్రలు అన్నారు, రైతులు పండించిన ప్రతి గింజను గిట్టుబాటు ధరలను కల్పిస్తూ కొనుగోలు చేయాలన్నారు, సన్న వరి ధాన్యానికి ప్రైవేటు రైస్ మిల్లు వారు 2700 పెట్టి సన్నధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం



రైతులను పట్టించుకోకపోవడం రైతులకు ఇవ్వాల్సిన బోనస్ను కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులను నిర్మాణం చేసి కొండపోచమ్మ మల్లన్న సాగర్ రంగనాయక సాగర్ లాంటి ఎన్నో రకాల ప్రాజెక్టుల నిర్మాణం చేసి ఎడారిగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పాడి పంటలతో ఆకుపచ్చ తెలంగాణగా మార్చిన ఘనత కేసిఆర్ అన్నారు కేసిఆర్ ప్రభుత్వంలో పుష్కలంగా ఎటుచూసిన మిషన్ భగీరథ ద్వారా 13 వేల చెరువులు నిండుకుండల, ఉన్నాయన్నారు. ప్రాజెక్టుల ద్వారా కెనాల్స్ ద్వారా చెరువులను గుంటలను నింపి కెనాల్స్ ద్వారా చెరువులను గుంటలను నింపి మండుటల్లో కెనాల్స్ ద్వారా చెరువులను గుంటలను కెనాల్స్ ద్వారా చెరువులను కుంటలను నింపి మండుటెండల్లో సైతం రైతుల పొలాలకు గోదావరి జలాలను అందించిన ఘనత కేసీఆర్ ది అన్నారు రైతులకు 24 గంటలు ఉచిత కరెంటు అందించిన ఘనత కేసిఆర్ ది అన్నారు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించిన ఘనత కేసిఆర్ ది అన్నారు. రైతులకు సకాలంలో యూరియా విత్తనాలు అందించిన ఘనత కేసిఆర్ అన్నారు రైతులకు సకాలంలో ప్రతి ఎకరానికి 10000 పెట్టుబడి అందించిన ఘనత కేసిఆర్ ది అన్నారు రైతులకు రైతు బీమా కల్పించిన రైతు బీమా కల్పించిన ఘనత కెసిఆర్ ది అన్నారు గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి రైతులను రాజులను చేసిన ఘనత కేసిఆర్ ది అన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను బిచ్చగాళ్ల ను చేసిందన్నారు రైతులను అప్పుల ఊబిలో కూర్కుపోయే టట్టు కాంగ్రెస్ పార్టీ విధానాలు ఉన్నాయన్నారు రైతు రుణమాఫీ చేయలేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు లేవన్నారు తెలంగాణ రాష్ట్రం పాడిపం టలతో సుభిక్షంగా ఉందన్నారు.సబ్బండ వర్గాలు సుభిక్షంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అసప్తప కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అసత్యపు వాగ్దానాలతో గద్దెనకి ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కిందన్నారు మహిళా భరోసా లేదన్నారు రుణమాఫీ చేయలేదన్నారు మహిళకు 2500 ఇవ్వడం లేదన్నారు పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు లక్ష ఆడవి లక్ష ఆడవి తెలంగాణ లక్ష ఆడవి తెలంగాణ కాంగ్రెస్ ఏర్పడిన ఐదు మాసాలలో 1,00,000 లక్ష పెళ్లిలు జరిగిన ఇప్పటివరకు తులం బంగారం లేదు దానితో పాటు కల్యాణ లక్ష్మి ఊసే లేదన్నారు కాంగ్రెస్ అంటేనే కరువు కాటకాలు కాంగ్రెస్ అంటేనే స్కీములు స్కాములు కాంగ్రెస్ అంటేనే అవినీతి అక్రమాలు కాంగ్రెస్ పార్టీ అంటేనే అబద్ధపు వాగ్దానాలు అసత్యపు హామీలు అసత్యపు ప్రచారాలని మండిపడ్డారు, గత కేసీఆర్ ప్రభుత్వ హ్యాంలో తెలంగాణ రాష్ట్రం భారత దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఉందన్నారు ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అవినీతి లేకుండా అందాయన్నారు. రైతుబంధు రైతు బీమా కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఆసరా పెన్షన్లు కేసీఆర్ కిట్లు ఒంటరి మహిళల పెన్షన్లు విడిపించలు గీత నేత కార్మికుల పెన్షన్లు 24 గంటల ఉచిత కరెంటు ఇలాంటి ఎన్నో రకాల సంక్షేమ ఫలాలను ప్రతి గడప ప్రతి గడప అందించిన ఘనత కేసిఆర్ అన్నారు.కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినారు గ్యారెంటీలను తుంగలో తొక్కిందన్నారు ఇప్పటికై నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎలాంటి ఉద్యమం జరిగిందో మళ్లీ ప్రజల పక్షాన పోరాటం ప్రారంభించడం జరుగుతుందన్నారు కేసీఆర్ కి ఉద్యమాలు పోరాటాలు కొత్తవి కావన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్సి రాజమౌళి, వైస్ చైర్మన్ జక్యోద్దీన్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, బబ్బూరి రజిత, గంగిశెట్టి రవీందర్, అరుణ భూపాల్ రెడ్డి, మద్ది రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మరికంటి కనకయ్య, రైతులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

## రైతుల కోసం బిఆర్ఎస్ పార్టీ రాస్తారోకో..!

### బిఆర్ఎస్. జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్...

**పెద్దపల్లి జిల్లా: మే 16 (వాయిస్ టుడే) గోదావరిఖని:** టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపు ఇచ్చిన సందర్భంగా.ఈరోజు టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ రైతు మోసపూరిత విధానాలను నిరసిస్తూ ఎన్నికల ముందు వడ్లకు 500 క్వింటాల్కు బోనస్ ఇస్తానని చెప్పి ఎన్నికలు అయిపోయాక సన్నపు వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని రైతులను మోసం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో 90% దొడ్డు వడ్లు ఉంటాయి కాబట్టి రైతులను మోసం చేసి విధానాలను ఎన్నికల తర్వాత అవలంబిస్తుంది కాబట్టి బి ఆర్ ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుంది వెంటనే దొడ్డు వద్దకు కూడా క్వింటాల్కు 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈరోజు గోదావరిఖనిలో రాస్తారోకో చేయడం జరిగింది.

